నమస్తే తెలంగాణ
తెలంగాణ జైత్రయాత్ర 2023

2

హైదరాబాద్ | శనివారం 4 నవంబర్ 2023 www.ntnews.com

**మీకు తెలుసా?**

## ధాన్యం కొనుగోళ్లు

| దేశంలో తెలంగాణ స్థానం | | తెలంగాణలో ధాన్యం కొనుగోళ్లు | | | |
|---|---|---|---|---|---|
| 2014లో | ఇప్పుడు | 2014-15లో | విలువ | 2022-23లో | విలువ |
| 14వ స్థానం | 2వ స్థానం | 24.29 లక్షల టన్నులు | ₹3,353 కోట్లు | 81.94 లక్షల టన్నులు | ₹16,853 కోట్లు |



**యార్కర్**



### తెలివి తెచ్చుకోవాలె

**వాట్సాప్ వర్సిటీ, యూట్యూబ్, ఫేక్ వీడియోలు చూసి ఆగమైన ఓ ఫ్రెండ్‌గాడు కలిసిండు**

'అరేయ్ కేసీఆర్‌ను
ఈ సారి మార్చేయాలి!'

'అవ్ గని.. నీకు గా ఒర్రెకాడ
రెండెకరాల
పొలం ఉండెగదా..? ఉన్నదా?!'

'ఆc ఉన్నదిరా..'

'నా తాన ఐదు లక్షలు జమైనయ్
గా పొలం అమ్ముతవారా..
కొనుక్కుంట..'

'ఛల్ ఐదు లక్షలకు ఏమొస్తదిరా..
అది పదేండ్ల కింద రేటు..
ఇప్పుడు ఎకరమే 60 లక్షలకు
పోతది..
యాడాదికి 20 వేల రైతుబంధు
అస్తుంది
5 లక్షల బీమా ఉన్నది..
భలే మంచిగున్నవ్ పో'

'అవునారా.. మరి,
కేసీఆర్ ఏంజేసిండ్రా దించేయాలే
అంటివిగదరా గిందాక!
నీ విలువ పెంచిందురా కేసీఆర్
నిన్ను కోటీశ్వరుడిని చేసిందురా కేసీఆర్
నీ బతుక్కు భరోసా చూపించిందురా
కేసీఆర్'

'అవునురా కర్రెక్టే...
ఆ పిచ్చి పిచ్చి వాట్సాప్
మెసేజ్‌లు..
యూట్యూబ్ వీడియోలు చూసి
నా బుద్ధి గడ్డి తిన్నదిరా
నువ్వు చెప్పింది అక్షరాల నిజమే'

- రాజు అతికం
9440012834

**వి(టి)కెట్ ఔట్**



### బచ్చాగాడివి.. నా ముందు నువ్వెంత!

డబ్బులు ఉంటే చాలు రాజకీయం చేయొచ్చని నమ్మి వనపర్తి జిల్లాలో ఓ చోటా లీడర్ బొక్కబోర్లా పడ్డాడు. కాంగ్రెస్ రాజకీయం తెలియక చేసిన శపథాలు, 'వనపర్తి టికెట్ నాదే'నంటూ బీరాలు పలికిన ఆ లీడర్ హస్తం రాజకీయాలకు బలైపోయారు. ఓ సీనియర్ నేత 'నువ్వు బచ్చాగాడివి.. నా ముందు కుప్పి గంతులా?' అంటూ టికెట్ ఎగరేసుకుపోవడంతో ఆ లీడర్ దిక్కుతోచని స్థితిలో పడ్డారు. టికెట్ నాకే ఇవ్వండి.. మహాప్రభో అంటున్నా అధిష్ఠానం లెక్కచేస్తలేదంట. మొన్నటి వరకు ఓ మండలానికి ఎంపీపీగా ఉన్న వ్యక్తి హఠాత్తుగా కారు దిగిపోయారు. ఏకంగా మంత్రినే ఓడిస్తానని శపథాలు చేశారు. హైదరాబాద్ నుంచి పెయిడ్ మీడియాలో, సమావేశాల్లో పిచ్చి ప్రేలాపనలు చేశారు. తొలుత కమలం పార్టీలో కలిసిపోదామని ఈటలను వనపర్తికి పిలిపించి ఆయన ముందే కొట్లాడుకోవడంతో 'టికెట్ ఎవరికి కావాలో నిర్ణయించుకొని హైదరాబాద్ రావాలి' అని చెప్పి ఆయన జారుకున్నారు. దీంతో జూపల్లిని పట్టుకొని కాంగ్రెస్‌లో చేరారు. కొల్లాపూర్ టికెట్ జూపల్లికి.. వనపర్తి టికెట్ తనకే ఇవ్వాలని ఢిల్లీలో బేరసారాలు చేశారు. 'సరే చూద్దాం లే' అని ఢిల్లీ పెద్దలు చెప్పడంతో 'టికెట్ నాదే' అంటూ సోషల్‌మీడియాలో ప్రచారంతో హోరెత్తించారు. నిన్నగాక మొన్న పార్టీలోకొచ్చి టికెట్ కావాలంటావా? అంటూ రాజకీయాల్లో తలపండిన చిన్నారెడ్డి టికెట్ చేజిక్కించు'కొన్నారు'. ఢిల్లీలో ఉండి లాబీయింగ్ చేసినా ఫలితం దక్కక తన సత్తా చూపిస్తానంటూ మీటింగ్ పెట్టి అభాసుపాలయ్యారు. సభకు వచ్చిన జనాలకు డబ్బులు ఇవ్వకపోవడంతో ఉన్న పరువు కాస్త పోయింది. జనాగ్రహం వీడియోలు సోషల్ మీడియాలో వైరలై, కాంగ్రెస్ పెద్దలకు చేరడంతో 'టికెట్ సంగతి దేవుడెరుగు తిట్ల పురాణం వినాల్సి వస్తున్నద'ని సదరు నేత వాపోతున్నారట!

- వెంకటేశ్వర్‌రావ్

**బిగ్ స్టోరీ**








# సక్కటి సదువు.. కమ్మటి బువ్వ

**'సర్కారు బడికి పోతే సక్కని సదువు చెబుతారు.. కడుపు నిండా బువ్వ పెడతారు' అనే నమ్మకం తల్లిదండ్రుల్లో బలంగా నాటుకున్నది. పాఠశాల విద్యకు కేసీఆర్ సర్కారు పెద్దపీట వేయడమే ఇందుకు కారణం. పిల్లలకు నాణ్యమైన విద్య అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. పాఠశాలల్లో వసతులను మెరుగుపరిచింది. మారుతున్న కాలానికి అనుగుణంగా డిజిటల్ విద్యను ప్రవేశపెట్టింది. పిల్లలకు చదువుతో పాటు చక్కని పౌష్టికాహారం కూడా అందిస్తున్నది. పదేండ్ల కాలంలో ప్రభుత్వం తీసుకున్న ఈ చర్యల ఫలితంగా నేడు రాష్ట్ర విద్యారంగంలో అనేక మార్పులొచ్చాయి. సమైక్య పాలనలో విద్యార్థులు లేక మూతబడ్డ ప్రభుత్వ బడులు ఇప్పుడు పిల్లలతో కళకళలాడుతున్నాయి.**

... కొంటు మల్లేశం

- అటు చదువు, ఇటు పౌష్టికాహారం
- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల కడుపు నింపుతున్న కేసీఆర్ సర్కారు
- విద్యాప్రమాణాలు, వసతుల పెంపుపై తెలంగాణ సమాజం హర్షాతిరేకాలు

ఉదయం వచ్చింది మొదలు సాయంత్రం ఇంటికెళ్లే వరకు చక్కటి చదువుతోపాటు పౌష్టికాహారాన్ని అందిస్తారు. ఉదయాన్నే బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం రాగి జావ ఇస్తారు. ఇక విద్యార్థి ఇంట్లో తినేది రాత్రి భోజనం మాత్రమే. పదో తరగతి విద్యార్థులకు స్పెషల్ క్లాసుల సమయంలో స్నాక్స్ కూడా ఇస్తారు. తల్లిదండ్రులకు ఎలాంటి ఫీజుల భారమూ లేదు. ఉచితంగా మల్టీకలర్ యూనిఫారాలు, ఆకట్టుకునేలా ఉన్న మల్టీకలర్ పాఠ్యపుస్తకాలు అందిస్తారు. ఇదీ తెలంగాణ సర్కారు బడుల్లో విద్యార్థుల కోసం కేసీఆర్ ప్రభుత్వం తీసుకున్న చొరవ. ఈ పదేండ్ల కాలంలో ప్రభుత్వం తీసుకున్న చొరవతో రాష్ట్ర విద్యారంగంలో అనేక మార్పులొచ్చాయి. ఇవన్నీ గుణాత్మక మార్పులు. వీటి ఫలితాలు క్రమంగా అందుతున్నాయి. సర్కారు బడుల్లో విద్యా ప్రమాణాలను పెంచింది ప్రభుత్వం.

### 26 వేల బడులల్లో ఇంగ్లిష్ మీడియం

గత ఏడాది రాష్ట్రంలోని 26 వేల బడులల్లో 1 నుంచి 8 తరగతుల వరకు ఇంగ్లిష్ మీడియం చదువులకు శ్రీకారం చుట్టారు. ఆంగ్ల మాధ్యమాన్ని ఈ విద్యా సంవత్సరం నుంచి 9వ తరగతి వరకు విస్తరించారు. వచ్చే ఏడాది పదో తరగతిలో కూడా ఇంగ్లిష్ మీడియం చదువులు అందుబాటులోకి వస్తాయి. గతంలో రాష్ట్రంలోని 462 స్కూళ్లల్లో మాత్రమే ఇంగ్లిష్ మీడియం అందుబాటులో ఉండేది. తెలుగుకు సమాంతరంగా ఇంగ్లిష్ మీడియం బోధించేందుకు పలు స్కూళ్లకు అనుమతులివ్వగా, వాటి సంఖ్య 2 వేలు మాత్రమే ఉండేది. కానీ ఇప్పుడు 26 వేల బడుల్లో ఇంగ్లిష్ మీడియం చదువులు అందుబాటులోకి వచ్చాయి. ఈ పాఠశాలలే నేడు పేద వర్గాల విద్యార్థులకు ఆశాదీపాలు అయ్యాయి.

### 5,089 పోస్టుల భర్తీకి డీఎస్సీ

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత 8,792 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసింది. స్కూల్ అసిస్టెంట్లు 1,745, ఉర్దూ మీడియం స్కూల్ అసిస్టెంట్లు 196, సెకండరీ గ్రేడ్ టీచర్లు 4,779, ఉర్దూ మీడియం సెకండరీ గ్రేడ్ టీచర్లు 636, భాషా పండితులు 985, ఉర్దూ మీడియం భాషా పండితులు 26, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు 374 మరో 61 పోస్టులను భర్తీ చేసింది. తాజాగా 5,089 టీచర్ పోస్టుల భర్తీకి గత నెలలో డీఎస్సీ నోటిఫికేషన్‌ను జారీ చేసింది.

### రెండు జతల యూనిఫాం

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థికి ఒకేరకమైన దుస్తులు ఉండేలా ప్రభుత్వమే ఒక్కో విద్యార్థికి రూ.600ల చొప్పున వెచ్చించి రెండు జతల యూనిఫాంలను ఉచితంగా అందజేస్తున్నది. ఇందుకు ఏడాదికి రూ.108 కోట్లను ఖర్చు చేస్తున్నది.









### పౌష్టికాహారం

దేశంలోని ఒకట్రెండు రాష్ట్రాలు మినహా మిగతా అన్ని రాష్ట్రాలు 1-8వ తరగతుల విద్యార్థులకు మాత్రమే మధ్యాహ్న భోజనాన్ని అందజేస్తున్నాయి. కేసీఆర్ ప్రభుత్వం మాత్రం 9, 10 తరగతుల వారికి కూడా మధ్యాహ్న భోజనం పెడుతున్నది. ఈ పథకంలో భాగంగా దేశంలోని అన్ని రాష్ట్రాలు పిల్లలకు దొడ్డుబియ్యం బువ్వ పెడుతుండగా, ఒక్క తెలంగాణ రాష్ట్రమే సన్నబియ్యం అన్నం పెడుతున్నది. 17.52 లక్షల మంది విద్యార్థులకు సన్నబువ్వతో పాటు, అరటిపండ్లు, కోడిగుడ్లను అందజే స్తున్నది. మధ్యాహ్న భోజనానికి 1 నుంచి 8వ తరగతుల వరకు గల విద్యార్థులకయ్యే వ్యయంలో కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం చొప్పున ఖర్చును భరిస్తుండగా, తెలంగాణ సర్కారు ఒక అడుగు ముందుకేసి 9, 10 తరగతుల విద్యార్థులకు 100 శాతం రాష్ట్ర ప్రభుత్వ నిధులతో మధ్యాహ్న భోజనాన్ని సమకూరుస్తున్నది. పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ నిధులతో వారానికి 3 ఉడకబెట్టిన కోడిగుడ్ల చొప్పున, నెలకు 12 కోడిగుడ్లు, రాగిజావ, బెల్లం, లేత మొలకలను అందిస్తున్నది.

**మధ్యాహ్న భోజనం చేసే విద్యార్థుల వివరాలు**

| తరగతి | స్కూళ్లు | విద్యార్థులు |
|---|---|---|
| 1-5 | 20,112 | 14,12,161 |
| 6-8 | 3,489 | 6,87,678 |
| 9-10 | 5,005 | 4,27,068 |
| మొత్తం | 28,606 | 25,26,907 |

**సీఎం బ్రేక్‌ఫాస్ట్ వివరాలు**

| స్కూళ్లు | విద్యార్థుల సంఖ్య | | |
|---|---|---|---|
| | 1-5 తరగతులు | 6-8 తరగతులు | 9-10 తరగతులు |
| ప్రభుత్వ, జిల్లా, మండల పరిషత్ | 11,57,541 | 6,18,463 | 3,65,138 |
| ఎయిడెడ్ | 37,473 | 23,340 | 13,823 |
| మాడల్ స్కూళ్లు | --- | 49,715 | 36,270 |
| మదర్సాలు | 2493 | 1,491 | 54 |
| మొత్తం | 11,97,507 | 6,93,009 | 4,15,285 |

### వినూత్న పద్ధతిలో కార్యక్రమాలు

సీఎం కేసీఆర్ ఆదేశాలతో ఒకటి నుంచి 5 తరగతుల కోసం 'తొలిమెట్టు', 6 నుంచి 9 తరగతుల వారి కోసం 'లర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్', 10వ తరగతి విద్యార్థుల కోసం 'లక్ష్య' కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. విద్యార్థులను భవిష్యత్తులో స్టార్టప్ ఫౌండర్లుగా తయారు చేసేందుకు 'అంకుర' కార్యక్రమాన్ని చేపట్టింది. గ్రంథాలయాలు, సైన్స్ ల్యాబ్‌లు, స్టెమ్ ల్యాబ్‌లను పెద్ద ఎత్తున నెలకొల్పింది. డిజిటల్ బోధనలో భాగంగా ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానళ్లను బడులకు అందించారు. కరోనా కష్టకాలంలో రాష్ట్రంలోని 1.2 లక్షల మంది ప్రైవేట్ ఉపాధ్యాయులు, సిబ్బందికి రూ.2 వేలు, 25 కిలోల బియ్యాన్ని మూడు నెలలపాటు అందజేసింది.

**పాఠ్యపుస్తకాలు**

| సంవత్సరం | విద్యార్థులు (లక్షలు) | పాఠ్యపుస్తకాలు (కోట్లల్లో) | ఖర్చు (కోట్లల్లో) |
|---|---|---|---|
| 2015-16 | 29.07 | 1.72 | 53.38 |
| 2016-17 | 28.02 | 1.75 | 53.29 |
| 2017-18 | 27.24 | 1.74 | 60.50 |
| 2018-19 | 26.49 | 1.64 | 62.77 |
| 2019-20 | 26.49 | 1.45 | 69.28 |
| 2020-21 | 26.59 | 1.40 | 52.84 |
| 2021-22 | 25.54 | 1.43 | 56.84 |
| 2022-23 | 31.24 | 2.10 | 132.79 |

### ఉచితంగా ద్విభాషా పుస్తకాలు

సర్కారీ స్కూళ్లల్లోని 26 లక్షల పైచిలుకు విద్యార్థులకు ఏటా రూ.52 కోట్లు ఉచితంగా పాఠ్యపుస్తకాలను అందజేసింది ప్రభుత్వం. గతేడాది నుంచి ద్విభాషా పుస్తకాలను ముద్రిస్తున్నది. దీంతో పాఠ్య పుస్తకాల ఖర్చు రూ.60.44 కోట్లకు చేరుకున్నది.

### వర్క్‌బుక్స్, నోట్‌బుక్స్ కూడా...

విద్యార్థులందరికీ ఉచితంగా నోట్‌బుక్స్, వర్క్‌బుక్స్‌ను అందజేసింది. ప్రాథమిక తరగతుల విద్యార్థులకు వర్క్‌బుక్స్, ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు నోట్‌బుక్స్‌ను అందజేశారు. రూ.34.70 కోట్లను ఖర్చుతో 11.27 లక్షల మంది విద్యార్థులకు మూడు చొప్పున మొత్తంగా 33.82 లక్షల వర్క్‌బుక్స్ ఇచ్చారు. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకున్న 12.39 లక్షల మంది విద్యార్థులకు 1.17 కోట్ల నోటుబుక్స్‌ను ఇవ్వగా, ఇందుకు రూ.56.24 కోట్లను ఖర్చు చేశారు.

### ఇంటర్ విద్యార్థులకూ...

ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు అందించేందుకు ఏడాదికి రూ.9 కోట్లు ఖర్చు చేస్తున్నది. ప్రభుత్వ కాలేజీల్లో అడ్మిషన్లు, లైబ్రరీ, స్పోర్ట్స్ వంటి ఫీజులను రద్దు చేసింది.

**'మన ఊరు-మన బడి' పథకం అమలు తీరిదీ...**

| | మొదటి విడత | రెండో విడత | మూడో విడత | మొత్తం |
|---|---|---|---|---|
| స్కూళ్లు | 9,123 (35 శాతం) | 9,123 (35 శాతం) | 7,819 (30 శాతం) | 26,065 |
| లబ్ధి పొందే విద్యార్థులు (శాతం) | 14,71,684 (63) | 6,81,924 (29) | 1,84,046 (8) | 23,37,654 |
| ఖర్చు (కోట్లల్లో) | రూ. 3,497.62 | రూ. 2,516.45 | రూ. 1,275.48 | రూ. 7289.54 |

### మన ఊరు-మన బడి..

సర్కారు బడుల భౌతిక స్వరూపాన్ని సమగ్రంగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు-మన బడి, మన బస్తీ-మన బడి కార్యక్రమాన్ని చేపట్టింది. మొత్తం మూడు విడతల్లో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని మొదటి విడతగా 2022-23 విద్యాసంవత్సరంలో చేపట్టారు. 1,240 బడులు సిద్ధం కాగా, పూర్తయినవి పూర్తయినట్లు ప్రారంభోత్సవాలు చేశారు. మొత్తం మూడు విడతల్లో 3,41,265 డ్యూయెల్ డెస్క్ బల్లలు, 1,39,585 గ్రీన్ చాక్‌పీస్ బోర్డులను అమర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇక 200లకు పైగా విద్యార్థులున్న బడులకు సోలార్ విద్యుత్తు కనెక్షన్లు ఇవ్వనుండగా, మొదటి విడతలో 1,521 బడుల్లో సోలార్ ప్యానళ్లు బిగించారు. ప్రభుత్వం ప్రకటించిన 12 అంశాలే కాకుండా పాఠశాలలకు స్వాగత తోరణాలు, గ్రీనరీ, పాత్ వే (నడక దారుల)లను సైతం నిర్మిస్తున్నారు. డిజిటల్ విద్యలో భాగంగా సర్కారు బడుల్లో 13,983 ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానళ్లు అందజేశారు.

**మొదటి విడతలో వెచ్చించిన ఖర్చు మొత్తం (9,123 స్కూళ్లకు)**

| చేపట్టిన పని | మొత్తం (రూ. కోట్లల్లో) |
|---|---|
| టాయిలెట్లు, నీటి వసతి | 212.76 |
| తాగునీటి వసతి | 5.76 |
| మేజర్, మైనర్ మరమ్మతులు | 444.64 |
| విద్యుత్తు లైన్లు | 88.34 |
| ఫర్నిచర్ | 265.66 |
| గ్రీన్ చాక్‌పీస్ బోర్డులు | 71.11 |
| బడులకు పెయింటింగ్ | 567.15 |
| ప్రహరీలు | 137.02 |
| కిచెన్ షెడ్లు | 100.33 |
| అదనపు తరగతి గదులు | 531.82 |
| డైనింగ్ హాళ్లు | 788.40 |
| డిజిటల్ విద్య | 284.60 |
| మొత్తం | 3,497.62 |



పర్వతగిరిలో 'మన ఊరు-మనబడి'లో పునర్నిర్మించిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల



ఉపాధ్యాయుల సమక్షంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల పఠనం




ప్రభుత్వం పంపిణీ చేసిన వర్క్‌బుక్స్‌తో చిన్నారులు